www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 6 డిసెంబర్ 2022
5
తిరుపతి



పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు..
8న జాతీయ స్థాయి సదస్సు: ఆర్‌పిఐ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఈనెల ఎనిమిదో తేదీన పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్‌పిఐ సౌత్ ఇండియా అధ్యక్షులు పి.అంజయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. సివిల్ సర్వీసు పోటీ పరీక్షల్లో పేద విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. తిరుపతి సాంఘిక సంక్షేమ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులను చైతన్యవంతులను చేయడానికి ప్రముఖ విద్యావేత్త డాక్టర్ డి.చక్రపాణి, ఐఎఎస్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలిపారు. అతిథులుగా చెన్నయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య, సిఐటియు రాష్ట్ర నాయకులు కందారపు మురళి పాల్గొంటారని, గురువారం ఉదయం 10 గంటలకు బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఈ సదస్సు ఉంటుందని తెలిపారు.

తల్లిదండ్రులు ఆడ, మగనే విచక్షణ చూపొద్దు

- మహిళా వర్సిటీ 'ముఖాముఖి'లో రాష్ట్రపతి
- శ్రీవారిని, అమ్మవారిని దర్శించుకున్న ద్రౌపది ముర్ము
- తిరుపతి పర్యటన విజయవంతం


శ్రీవారి సేవలో...

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, క్యాంపస్, తిరుమల

'భారతదేశ ప్రథమ పౌరురాలిగా తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నాను.. ఆడ, మగనే విచక్షణ చూపొద్దు.. అబల, దుర్బల అనే మాటలు అర్థాన్ని కోల్పోయాయి.. సబలగా మహిళలు అన్ని రంగాల్లో ప్రవేశించి నిరూపించుకుంటున్నారు..' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. 'మనం మన కోసం జీవిస్తే అందులో గొప్ప ఏముంది.. ఇతరుల కోసం జీవించడంలోనే జీవిత పరమార్థం ఉంది. మనిషిగా పుట్టడంలోని ఔన్నత్యం ఉంది.' అన్నారు.

ఆదివారం రాత్రి తిరుమల చేరుకున్న రాష్ట్రపతి రాత్రి అక్కడే బస చేసి, సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మహిళా వర్సిటీ ప్రాంగణంలోకి అడుగుపెడుతూనే అక్కడ ఉన్న మహిళలు తయారు చేసిన చేతి ఉత్పత్తులను చూశారు. తిరుపతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, మహిళా పారిశ్రామికవేత్తలు, విద్యార్థినులు, విశ్వ విద్యాలయ టీచింగ్ ఫ్యాకల్టీతో రాష్ట్రపతి ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంగలి పని అంటే చులకన,.. బ్యూటీ పార్లర్ అంటే గౌరవం అంటూ వివక్షతో చూడకూడదన్నారు. పని పనేనని, ఆ పనిని మనం ఎంత ఆత్మగౌరవంతో చేస్తున్నామనేది గమనించాలన్నారు. మహిళలు క్రీడలు, బయోటెక్నాలజీ, న్యూట్రిషన్, సంప్రదాయ కళల్లో ప్రవేశించి అంకితభావంతో పనిచేస్తూ ఫలితాలను చూపిస్తున్నారన్నారు. స్వయం సహాయక మహిళా బృందాలు స్వశక్తిపై ఆధారపడి సాధికారిత దిశగా అడుగులేస్తున్నారని, చదువు లేకపోయినా శక్తి సామర్థ్యాలు తప్పక ఉంటాయని వారు నిరూపిస్తున్నారని, వ్యవసాయ రంగంలో మనకు ఇది ఎక్కువగా కనిపిస్తుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ లేదా ఇతర విభాగాల విద్యార్థినులు వెనకబడిన పల్లెల్లో కనీసం రెండురోజుల పాటు అక్కడి శిబిరంలో ఉండి వారి జీవన విధానాలను పరిశీలించాలన్నారు. అందువల్ల అఖిల భారత సర్వీసులకు వెళ్లే వారికి ఈ క్షేత్ర అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్షేత్ర అనుభవాలను కలెక్టర్‌తో పంచుకుని ఒక నివేదిక ద్వారా వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలన్నారు. 'ఏక్ అకేలా థక్ జాయేగా, తో మిల్కర్ బోఝ్ ఉఠానా ..అనే పాటను గుర్తుచేస్తూ ఒకరే పని చేస్తే అలసిపోతారు. కలిసి పని చేస్తే ఎంత భారాన్నైనా సులభంగా మోయొచ్చు' అంటూ ఆత్మ నిర్భర్ భారత్ ఇలా చేయడం వల్లనే సాధ్యపడుతుందని చెప్పారు. ఆడపిల్ల మగపిల్లలనే విచక్షణ చూపకుండా పెంచాలని తల్లిదండ్రులకు రాష్ట్రపతి ప్రథమ మహిళగా తాను విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఏ దేశంలో మహిళలు ప్రగతిపథంలో నడుస్తూ ఉంటారో ఆ దేశం ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో ఉంటుందన్నారు. 'ఈ విశ్వ విద్యాలయ సందర్శన వల్ల ఎన్నో సమాధానాలు మీ ద్వారా లభించాయి.. ఇది నాకు తృప్తిగా ఉంది' అని ముగించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రివర్యులు కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర క్రీడల సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కె రోజా, వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దువ్వూరు జమున వేదికపై ఆశీనులయ్యారు.

మహిళలతో 'ముర్ము' ముఖాముఖి

జాతీయ హాకీ టీం సభ్యురాలు రజని మాట్లాడుతూ గ్రామీణ పాఠశాల విద్య నుంచి తాను ఇపుడు జాతీయ స్థాయి హాకీ టీంలో ఉన్నందుకు ఎంతో గర్విస్తున్నానని, గ్రామీణ ప్రాంత


మహిళా వర్సిటీలో...

క్రీడాకారులకు మరింత స్ఫూర్తిదాయకంగా కొన్ని పనులు చేస్తానన్నారు. రాధాభాయి మాట్లాడుతూ క్షురకర్మ పనిలో సంప్రదాయ విరుద్ధంగా మహిళగా తాను చేసిన, చేస్తున్న కృషిని వివరించారు. మొదట్లో కొంత వ్యతిరేకత వచ్చినా ధైర్యంగా నిలబడి ఆ పనిలో మహిళలకు శిక్షణ ఇచ్చి, జాతీయ మహిళా కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్, మానవహక్కుల సంఘం మొదలైన వారిని సంప్రదించానని, ఇవాళ అనేక రాష్ట్రాల్లో మహిళలు క్షురక వృత్తిని చేపట్టడంలో సహాయపడుతున్నానని చెప్పారు. న్యూట్రిషన్ విభాగ విద్యార్థిని మాట్లాడుతూ మహిళల్లో పోషకాహార లోపం వల్ల రక్తహీనత లాంటి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, పోషకాహారం పట్ల మహిళల్లో జాగరుకత పెంచే ప్రయత్నాలను చేస్తున్నట్లు వివరించారు. కూచిపూడి నృత్యకారిణి ఎంవిఎస్‌ఎన్ దుర్గ మాట్లాడుతూ కూచిపూడి నృత్యం అభ్యసించి ఇప్పటివరకు 500 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

శ్రీవారి దర్శించుకున్న రాష్ట్రపతి

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని సోమవారం ఉదయం భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము దర్శించుకున్నారు. ఉదయం 9.30 గంటలకు తిరుమలలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనం నుంచి బయల్దేరి తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవారి పుష్కరిణిలో నీటిని ప్రోక్షణం చేశారు. తొలుత వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడనుంచి ఆలయానికి చేరుకున్న ఆమెకు టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి సాదరంగా ఆహ్వానించారు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. పెద్దజీయంగార్ స్వామి, చిన్నజీయంగార్ స్వామి పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు వేణుగోపాల్ దీక్షితులు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి శేష వస్త్రాన్ని, తీర్థప్రసాదాలను రాష్ట్రపతికి అందజేశారు. అలిపిరి వద్ద సప్త గోప్రదక్షిణ మందిరాన్ని దర్శించుకున్నారు. గోవులకు అరటిపండ్లు, మేత తినిపించి వాటికి నూతనవస్త్రాలను సమర్పించారు. అనంతరం గో గులాభారంలో గోవును ఉంచి, దాని బరువుకు సరిపడేలా 435 కిలోల సమగ్ర దాణాను విరాళంగా అందించారు. ఇందుకు సంబంధించిన ఆరువేల రూపాయలను గోమందిరం అధికారులకు అందజేశారు.

సాదర వీడ్కోలు

తిరుమలలో రెండు రోజుల పర్యటన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్రపతికి సాదర వీడ్కోలు లభించింది. మంత్రులు కె.నారాయణస్వామి, కె. సత్యనారాయణ, దేవాదాయ రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్, ఎపి అదనపు డిజిపి శాంతి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి ఎస్.పరమేశ్వర్‌రెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ జి.భానుప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

జాతీయ జెండాతో టిడిపి అభివాదం

రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ్ సోమవారం అలిపిరి నుంచి పద్మావతి మహిళా యూనివర్సిటీకి వెళుతుండగా తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి నాయకులు వారి నివాసం వద్ద కాన్వాయ్ వెళుతుండగా రోడ్డు పక్కన నిల్చుని జాతీయ జెండాను పట్టుకుని అభివాదం చేశారు. అంతకుముందు రాష్ట్రపతి వెళ్లే మార్గంలో భద్రత చర్యలు చేపట్టిన పోలీసులు సుగుణమ్మ ఎక్కడ ధర్నా చేస్తుందో అని భయంతో వారి ఇంటి వద్ద పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. సుగుణమ్మ ధర్నా చేయడం లేదని కేవలం జాతీయ జెండాతో అభివాదం చేస్తున్నారని చెప్పడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.


వీడ్కోలు...


చంద్రగిరిలో విచారిస్తున్న డిఎంహెచ్ఒ

రోడ్డు పక్కనే మహిళ ప్రసవం

ఆగ్రహించిన డిఎంహెచ్ఒ విచారణ చేపట్టిన చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రి ప్రాంగణంలోనే మహిళ ప్రసవం... చంద్రగిరి మండలం చెర్లోపల్లి రోడ్డు పక్కనే మరో మహిళ ప్రసవం... ఈ ఘటనలే ఆరోగ్య శాఖ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. చంద్రగిరి మండలం, తొండవాడ దళితవాడకు చెందిన శాంతి, తన భర్తతో విభేదించి అమ్మగారి ఇంట్లోనే ఉంటుంది. అయితే ఆదివారం అర్థరాత్రి నుంచి శాంతికి కడుపు నొప్పి రావడంతో సోమవారం ఉదయం చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి శాంతిని తల్లి మునెమ్మ, సోదరుడు మణికంఠ తీసుకొచ్చారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి సిఫార్సు చేశారు. దీంతో మణికంఠ, శాంతి, మునెమ్మలు ముగ్గురూ కలిసి ద్విచక్ర వాహనంపై తిరుపతి ఆసుపత్రికి వెళుతుండగా మార్గమధ్యలో నొప్పులు రావడంతో చెర్లోపల్లి వద్ద రోడ్డుపైనే ప్రసవించింది. అనంతరం స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా 108 వాహనంలో తిరుపతి మెటర్నిటీ ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. సమాచారం అందుకున్న తిరుపతి జిల్లా డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రీహరి, డిపిఎంఒ డాక్టర్ శ్రీనివాసులు ఆసుపత్రికి వెళ్లి తల్లిబిడ్డను పరామర్శించారు. అనంతరం చంద్రగిరి ఏరియా ఆసుపత్రికి వచ్చి శాంతిని కనీసం గర్భవతిగా నమోదు చేయలేదని చంద్రగిరి వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసారు. రోడ్డుపై ఓమహిళ


ప్రసవం అనంతరం 108 వాహనంలో..

ప్రసవిస్తుంటే ఏం చేస్తున్నారంటూ సిబ్బందిపై మండిపడ్డారు. దీనిపై విచారణ చేపట్టి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తొండవాడలో శాంతి కుటుంబ సభ్యులను విచారించారు.

'వంటమ్మ'లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలి:సిఐటియు

తిరుపతి టౌన్ : మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను (వంటమ్మలు) ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనం ఇవ్వాలని, 12నెలలకూ వేతనాలు ఇవ్వాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు రూ.20 పెంచాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయమ్మ డిమాండ్‌చేశారు. నూతన మెనూలోని హాట్ పొంగలి, సాంబార్ బాత్, ఆకుకూర అన్నం తొలగించాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. రాజకీయ వేధింపులను ప్రభుత్వం ఆపాలని అధికారులకు వినతి చేశారు.



మోహన్‌కృష్ణ కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

చంద్రగిరి మండలం రెడ్డివారిపల్లెలో కుల దురహంకార హత్య అమానుషమని, . కన్న కూతురిని దారుణంగా హతమార్చిన తల్లిదండ్రులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జల్లాకార్యదర్శి పి.సాయిలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మునిరామయ్య డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో పరువు హత్యలు పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మూడు నెలల క్రితం మోహనకష్ణ మృతిచెందిందని, కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు పక్కదారి పట్టించారన్నారు. అయితే పోస్టుమార్టం రిపోర్టులో హత్యని బయట పడిందన్నారు. దళిత యువకుని ప్రేమించినందున పరువు పోతుందని, ఆమెపై అంతటి ఘోరానికి పాల్పడ్డారన్నారు. నేటికీ స్త్రీకి వ్యక్తిత్వం ఉంటుందనే అంశాన్ని గుర్తించడం లేదన్నారు. ఆధునిక కాలంలోనూ కుల, లింగ వివక్ష భయంకరమైన రూపంలో ఉందనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఈ దారుణ ఘటనపై విచారణ



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మునిరామయ్య

జరిపి నిందితులను అరెస్టు చేసి ఫాస్ట్‌ట్రాక్‌కోర్టులో విచారణ జరిపి, శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితులకు ఎవరూ మద్దతు ఇవ్వరాదని కోరారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో వ్యకాసం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, సిఐటియునగర కార్యదర్శి వేణు, ఐద్వా జిల్లా అధ్యక్షులు జయంతి, నాయకులు ఎన్‌డి శ్రీనివాసులు, బుజ్జి, మోహనరావు, జెవికెఎస్ నాయకులు దేవానంద్, గీత పాల్గొన్నారు.

మురికినీటి శుద్ధి కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి వినాయకసాగర్ పక్కన నిర్మాణంలో వున్న మురికినీటి శుద్ధి కేంద్రాన్ని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి సోమవారం పరిశీలించారు. ఈ నెల చివరి లోపు పనులను పూర్తి చేసి ప్రారంభించేందుకు త్వరగా సిద్ధం చేయాలన్నారు. తిరుపతి నగరంలోని ఒక పార్ట్ నుండి వెలువడే మురికి నీరు గతంలో వినాయకసాగర్లోకి చేరేదని, దాదాపు 10 కోట్లతో నిర్మిస్తున్న ఈ మురికినీటి శుద్ధి కేంద్రం వినియోగంలోకి వస్తే రోజుకి 50లక్షల లీటర్ల మురికి నీటిని వివిధ దశల్లో శుద్ధిపరిచి పూర్తి స్థాయిలో మంచినీటిగా మార్చి వినాయకసాగర్ కు తరలించడం జరుగుతుందన్నారు. వినాయకసాగర్ నిండిన తరువాత మిగిలిన నీటిని వ్యవసాయానికి మళ్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, కాంట్రాక్ట్ ఇంజనీర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

వైసిపి వల్లే రాయలసీమకు అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాయలసీమ అభివద్ధి చేయకుండా అన్యాయం చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందని తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విమర్శించారు. సోమవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన 'బీసీలకు ఇదేమి ఖర్మ' అని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణమ్మ మాట్లాడుతూ రాయలసీమకు ఒక ప్రాజెక్టు కూడా జగన్ మోహన్ రెడ్డి తీసుకురాలేదన్నారు. అమర్‌రాజా ఫ్యాక్టరీ, మరో రెండు కార్పొరేట్ కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లిపోయాయన్నారు దీనివల్ల రాయలసీమలో ఉండే నిరుద్యోగులు ఉపాధి లేకుండా చేశారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలోని రాయలసీమ అభివద్ధి జరిగిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు సుర సుధాకర్ రెడ్డి, టిడిపి నగర అధ్యక్ష కార్యదర్శులు చినబాబు, మహేష్ యాదవ్, ఆర్‌సి మునికృష్ణ పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

తిరుపతి టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణలు ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మంచినీళ్ళగుంటలో చెట్లు పెరిగిపోయి అపరిశుభ్రంగా వుందనే ఫిర్యాదుపై వారు స్పందిస్తూ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కరకంబాడి రోడ్ రాజారెడ్డి నగర్లో సైడు కాలువలు నిర్మాణం సగం మాత్రమే చేసారనే ఫిర్యాదుపై ఇంజనీరింగ్ అధికారులు వచ్చి పరిశీలించి తగు చర్యలు చేపట్టారు. సిపిఎం తరుపున వచ్చిన ఫిర్యాదులో గంగమ్మగుడి దగ్గర డ్రైనేజి వర్క్ చేశారని, దానిని ఇంకా పూడ్చి లెవల్ చేయలేదని, సుందరయ్యనగర్లో కాలువలు రిపేరు చేయాలని, శ్రీనగర్ ఆరవ క్రాస్ లో నాలుగు రోజులుగా నీటి సరఫరా లేదని తెలిపారు. గిరిపురంలో డ్రైనేజి నీరు ఐదు నెలలుగా పొంగుతున్నదని, శాశ్వత పరిష్కారం తీసుకోవాలనే ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్.ఈ మోహన్ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు భద్రత కల్పించాలి : సిఐటియు

నగర నూతన అధ్యక్ష కార్యదర్శులుగా మునిరాజా, వేణుగోపాల్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్




తిరుపతి నగరంలో ఆటో, బిల్డింగ్, హాకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, సెల్ఫోన్ అమ్మకాలు, ప్రవేట్ టెలివిజన్ సేవలు, కొరియర్, పెట్రోల్ బంకులు, సినిమా హాల్స్ షాపింగ్ మాల్స్‌లోనూ, స్విగ్గి కార్మికులకు ప్రభుత్వ నిర్ణయించిన కనీస వేతనాలు, పిఎఫ్ ఈఎస్ఐ, కార్మిక చట్టాలు వర్తించడం లేదని సిఐటియు నగర నూతన అధ్యక్ష కార్యదర్శులు మునిరాజా, వేణుగోపాల్ డిమాండ్ చేశారు. నగర మహాసభ రెండో రోజు నూతన కమిటీ ఎన్నికయ్యింది. అధ్యక్షులుగా పి.మునిరాజా, ప్రధాన కార్యదర్శిగా కె.వేణుగోపాల్, కోశాధికారిగా ఎం.రఘు, ఉపాధ్యక్షులుగా టి.సుబ్రమణ్యం, పి.చిన్నపెం.త్యాగరాజురెడ్డి, ఎం.ఆనంద్, డి.గోపీనాథ్, పరశురాం, సహాయ కార్యదర్శులుగా పి.బుజ్జి, జి.చినబాబు, తంజావూరు మురళి, సి.భాస్కర్, హమాలీ రమేష్, ఎ.అన్నపూర్ణ కలిపి 15 మంది ఆఫీసు బేరర్స్‌గా, 49 మందితో కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది.

ఆశా వర్కర్లకు పని భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - నాయుడుపేట సుప్రీంకోర్ట్ తీర్పు ప్రకారం ఆశా వర్కర్లకు 26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, కార్మికులుగా గుర్తించి రిటైర్మెంట్ బెనిఫిట్స్, 5 లక్షల ఎక్స్రేషియా ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం నాయుడుపేట లోని సుందరరామిరెడ్డి భవన్ లో ఆశా వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవవేతనం పేరుతో ఆశా వర్కర్స్ శ్రమను దోపిడి చేస్తున్నాయని, కోవిడ్ కాలంలో ఆశాలు తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి కరోనా బాధితులకు సేవలు అందించారన్నారు. కోవిడ్ విధులలో తమ ప్రాణాలను కోల్పోయిన ఆశా వర్కర్లకు ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదన్నారు. అనంతరం తిరుపతి జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకుంది. కమిటీ అధ్యక్షురాలుగా కె.విజయలక్ష్మి, కార్యదర్శిగా ఎ.కిష్టమ్మ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



రేషన్ మొబైల్ ఆపరేటర్ల వెతలు....

- వ్యక్తిగత ఖాతాల నుంచి ఇన్సూరెన్స్ కట్
- పోర్ట్‌ఫైడ్ బియ్యం సరఫరాకు ఇవ్వని బత్తెం
- బటన్ నొక్కి ఆదుకోవాలంటున్న ఎండీయూవోలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఇంటి వద్దకే రేషన్ విధానంలో కీలక పాత్ర పోషిస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ ఆపరేటర్ల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ఎండీయూవోలను అన్ని పనులకు ముందస్తుగా వినియోగించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి సాయమందించడంలో మాత్రం వెనకంజ వేస్తోంది. చాలీ చాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న ఎండీయూ ఆపరేటర్లు వైసీపీ ప్రభుత్వం తెస్తున్న రోజుకో విధానంతో సతమతమవుతున్నారు. జీతాలు, కమీషన్ల ఆశచూపి వారి చేత అదనపు పనులు చేయించుకుంటోందే తప్ప వారికిచ్చిన హామీలను నెరవేర్చడం లేదు. " అవసరం ఉన్న వారు అడిగితే అక్కసు వెళ్లగక్కడం..అడగని వారికి పథకాల పేరిట ప్రేమ కురిపించడం" వైసీపీ సర్కారుకు అలవాటుగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. ఇదంతా రాజకీయ లబ్ధికోసమేనన్న ఆరోపణలూ లేకపోలేదు.

- **వ్యక్తిగత ఖాతాల నుంచి ఇన్సూరెన్స్ కట్**

మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ విధానాన్ని తొలుత ప్రవేశపెట్టేటప్పుడు ప్రభుత్వమే ఆ వాహనాలకు ఇన్సూరెన్స్ కడతానంది. ఆ మేరకు 2021లో ప్రతి వాహనానికి రూ.11 వేలు చొప్పున ఇన్సూరెన్స్‌కు జమచేసింది. అయితే 2022 వచ్చేసరికి ఇన్సూరెన్స్ నగదు జమచేయకపోవడంతో సంబంధిత కంపెనీ ఎండీయూ ఆపరేటర్ల వ్యక్తిగత ఖాతాలనుంచే జమచేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 9260 ఎండీయూ వాహనాలు నడుస్తున్నాయి. వాటన్నింటికీ ఇన్సూరెన్స్‌లో భాగంగా ఆపరేటర్ల వ్యక్తిగత ఖాతాలనుంచి రూ.10.18 కోట్లు జమ చేసుకుంది. ఆ మొత్తాన్ని తమ ఖాతాలకు జమచేయాలని 11 నెలలుగా ఎండీయూ ఆపరేటర్లు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా కనికరించిన పరిస్థితి.

- **పోర్ట్‌ఫైడ్ బియ్యం సరఫరాకు ఇవ్వని బత్తెం**

స్కూళ్ళు, అంగన్వాడీ కేంద్రాల విద్యార్థులకు సాధారణ బియ్యం కాకుండా పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించింది. ఆ బియ్యాన్ని డీలర్ల ద్వారా కాకుండా ఎండీయూ ఆపరేటర్ల ద్వారా చేరేలా ఆదేశాలు జారీ చేసింది. అందుకోసం అయ్యే ఖర్చును బత్తా రూపంలో చెల్లిస్తామంటూ హామీనిచ్చింది. అయితే స్కూళ్లకు, అంగన్వాడీ కేంద్రాలకు ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేసి రెండు నెలలు దాటిపోతున్నా ఇప్పటి వరకు నయాపైసా కూడా మాకివ్వలేదని ఎండీయూ ఆపరేటర్లు వాపోతున్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా కొందరు ఎండీయూ ఆపరేటర్లకు సాంకేతిక కారణాలు చూపుతూ ఇప్పటి వరకు జీతాలు చెల్లించలేదనీ, ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి కలుగజేసుకుని జీతాలు, ఇన్సూరెన్స్, ఫోర్ట్ ఫైడ్ బియ్యం బత్తా కలిపి ఒకే సారి బటన్ నొక్కి ఎండీయూ ఆపరేటర్ల వ్యక్తిగత ఖాతాల్లో జమచేయాలని వేడుకుంటున్నారు.అది చెయ్యాలి..ఇలా నడుచుకోవాలంటూ ఎండీయూవోలతో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా స్వయంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌మార్ మాట్లాడుతున్నారనీ, కానీ సమస్యలు చెబితే మాత్రం పట్టించుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎండీయూ ఆపరేటర్ల వెతలు తీర్చాలని కోరుతున్నారు.

రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి- రేణిగుంట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులు జరిగిన 66వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -19 బాల బాలికల రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా వెస్ట్ గోదావరి, ద్వితీయ స్థానం నెల్లూరు జిల్లా, తృతీయ స్థానం చిత్తూరు జిల్లా జట్టు గెలుచుకున్నాయని చిత్తూరు జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జయరాం, జిల్లా పరిషత్ బాలిక ఉన్నత ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ టోర్నీలో పాల్గొన్న 120 మంది బాల బాలికలకు, విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు

మహిళలపై హింస వద్దు సిడిపిఓ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మహిళలపై హింస వద్దు అని, సురక్షిత సమాజం కావాలని పుత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి పద్మజ పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ డే ఆన్ వైలెన్స్ అగైన్స్ట్ మహిళ క్యాంపెయిన్‌లో భాగంగా 16 రోజులపాటు అవగాహన సదస్సులు నిర్వహించారు. దీనిలో భాగంగా సోమవారం నేసనూరు పంచాయతీలోని గ్రామ సంఘం సభ్యులు, అంగన్వాడీ కేంద్ర లబ్ధిదారులు గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తల్లిదండ్రులు వీరికి పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ధనమ్మ, సర్పంచులు, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు

టీడీపీలోకి వైసీపీ వలసలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని సున్నపు హరిజనవాడకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వీరంతా టిడిపి కండువాలు కప్పుకున్నారు. జగన్ రెడ్డి పాలనపై విసుగు చెందిన వీరంతా టీడీపీలో చేరడం జరిగిందని సుధీర్ అన్నారు. టీడీపీలో చేరిన వారిలో యోగి, గణేష్, పురుషోత్తం, విష్ణు వర్ధన్, శేఖర్, మురళి, నానితో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు గ్రామస్తులు ఉన్నారు. పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, దశరధాచారి, చెంచయ్య నాయుడు, ముని రాజా నాయుడు, రవీంద్రనాథ్ రెడ్డి, మురళి నాయుడు, పాపి రెడ్డి, కంఠా రమేష్, కృష్ణ యాదవ్, గోపీనాథ్, రమేష్, దుర్గ, సునీత, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని రామాపురం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించి ప్రజలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎవరికైనా ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.డీఓ ప్రేమ్ కుమార్, రామాపురం సర్పంచ్ బాలిరెడ్డి, మండల తహశీల్దార్ జరీనా బేగం, ఈ.ఓ.పి.ఆర్డీ సురేంద్రనాథ్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు తక్షణమే అప్పగించాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నెలాఖరులోపు టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పజెప్పకపోతే లబ్ధిదారులతో కలిసి సిపిఐగా గృహప్రవేశం చేయిస్తామని సీపీఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి.మహేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో పుత్తూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టిడ్కో గృహాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నాయకులు గోపి, సెల్వరాజ్ ఆచారి, రాజేష్, గజేంద్ర, రమేష్, రవి, భాస్కర్, సుబ్రమణ్యం కార్యకర్తలు, టిడ్కో గృహాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

రామచంద్రపై దాడి అమానుషం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పుంగనూరు జనసేన నేత రామచంద్రపై వైసిపి అల్లరి మూకలు దాడి చేయడం అమానుషమని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ సోమవారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. రామచంద్ర యాదవ్ తలపెట్టిన రైతుభేరి కార్యక్రమాన్ని పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని ఆపడమే కాకుండా, వారి ఇంటిలోని వస్తువులను ధ్వంసం చేసి అరాచకం సృష్టించడం వైసిపి సర్కారు దుర్నీతికి నిదర్శనమని మండిపడ్డారు. ఇదేనా వైసిపి ప్రభుత్వానికి బీసీలపై వున్న చిత్తశుద్ధి? అంటూ ప్రశ్నించారు. రైతు సదస్సు నిర్వహించాలనుకోవడం ద్రోహమా? ఇది ముమ్మాటికి ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమే అవుతుంది. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజాస్వామిక వాదులంతా ఈ దాడిని ఖండించాలని పిలుపునిచ్చారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: సమగ్ర శిక్షా అభియాన్, పాఠశాల విద్యాశాఖ తిరుపతి జిల్లా వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత వైద్య శిబిరం పుత్తూరు బాలికల హైస్కూల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను వారికి కావలసిన వైద్యాన్ని వారి సౌకర్యం కోసం అందించాలన్నారు. అలాగే సైకాలజిస్ట్ పిల్లలకు కావాల్సిన సమ్మతమైన వైద్యాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హై కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, సుదర్శన్ రెడ్డి కీర్తి, రవీంద్రబాబు, ఉదయకిరణ్, సైకాలజిస్ట్ డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, న్యూరాలజిస్ట్, గాయత్రికుమారి హెచ్ఎంతల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు.

కోటలో ఆక్రమణలు తొలగేనా..!

- నిత్యం ట్రాఫిక్ సమస్యలతో అవస్థలు
- ఆర్డీవో చొరవతో పనులకు శ్రీకారం



కోట బజారులో ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి -కోట: కోట పట్టణంలోని బజారు వీధిలో ఆక్రమణలు విచ్చలవిడిగా ఉండటంతో ఇరుకు రోడ్లతో స్థానికులు.. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆక్రమణలు తొలగిస్తే కోట రూపురేఖలు మారుతాయని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో కోట పట్టణంలో రోడ్డు నిర్మాణం కోసం ఆర్ అండ్ బీ అధికారులు మార్కింగ్ ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం అధికారులు ఆక్రమణ దారులకు నోటీసులు అందించినా.. ఆక్రమణలు తొలగిస్తారా.. లేదా అని ప్రజలు సందిగ్ధంలో పడ్డారు. ఆక్రమణలను తొలగిస్తే కోట పట్టణ ప్రజల కల నెరవేరి నట్టే. కోట బజారు వీధిలో అటూ ఇటూ వచ్చేపోయే వాహనాలతో పూర్తిగా ట్రాఫిక్ నెలకొంటోంది. డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. ఒక వీధి దాటాలంటే గంట సమయం పడుతోందని వాపోతున్నారు. ముఖ్యంగా కోట గాంధీ బొమ్మ సర్కిల్ వద్ద బస్సు తిరగాలంటే చాలా కష్టతరంగా మారింది.

ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్య ఎన్నో సంవత్సరాల నుంచి కోట ప్రజలకు తప్పడం లేదు. ఇబ్బందులు పడుతూనే ఉంటున్నారు. గత కొన్ని రోజుల క్రితం ప్రజలు ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలతో ఉందని.. ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని.. ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ దష్టికి ప్రజలు తీసుకెళ్లారు. దీంతో తక్షణమే స్పందించిన ఆర్డీవో ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. ఆర్ అండ్ బీ డీఈ, తహసీల్దారు రోడ్లు పరిశీలించి త్వరలోనే రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభించాలని తెలిపారు. ఎట్టకేలకు అకారులు స్పందించి రోడ్ల మరమ్మతు పనులు చేస్తున్నారు. కోట క్రాస్ రోడ్డు నుంచి కోట వినాయక గుడి వరకు రోడ్డుకు ఇరువైపులా ట్రాక్టర్ సాయంతో వెడల్పు చేస్తున్నారు. అయితే ట్రాఫిక్ సమస్యంతా బజారులోనే ఉంది. సమస్యను పరిష్కరించగలిగితే కోట బజారులో ట్రాఫిక్ సమస్యే ఉండదు. కోట ఆర్టీసీ బస్టాండు నుంచి గాంధీబొమ్మ, కొక్కుపాడు వైపు వెళ్లే రోడ్డు వరకు, జరుగుమల్లికి వెళ్లే వైపు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలిగిస్తే ట్రాఫిక్ సమస్యే లేకుండా పోతుందని ప్రజలు అంటున్నారు. ఓ పక్క ఇప్పటికే పంచాయతీ అధికారులు 150 మందికి ఆక్రమణలు స్వయంగా తొలగించాలని నోటీసులు పంపారు. గతంలో నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, చిట్టేడు, కోట క్రాస్ రోడ్డులో ఉన్న ఆక్రమణలు తొలిగించి రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. మరి కోటలో మాత్రం ఆక్రమణలు తొలగించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే ఆక్రమణలు తొలగించి రోడ్డ పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలి



కోట పంచాయతీ పరిధిలో రోడ్డుకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలి. రోడ్డు నిర్మాణం కోసం రూ.40 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. కోట ఆక్రమణ దారులందరూ అధికారులు, ప్రజలకు సహకరించాలి.
- భవాని, ఎంపీడీవో

ఆక్రమణదారులకు నోటీసులు



ఆక్రమణదారులకు ఇదివరకే నోటీసులు అందించాం. నోటీసులు అందుకున్న వారు 7 రోజుల్లో ఆక్రమణలు తొలగించుకోవాలి. పంచాయతీకి చెందిన నిర్మాణాలను కూడా తొలగించే చర్యలు తీసుకుంటాం.
- శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి

శాంతియుతంగా చర్యలు



అధికారులు ఆక్రమణదారులతో సంప్రదించి శాంతియు తంగా ఆక్రమణలు తొలగించాలి. దౌర్జన్యం లేకుండా రోడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలి. ఆక్రమణ దారులు సైతం అధికారులకు సహకారం అందించాలి.- **ఎస్.అన్వర్‌బాషా, మండల కో -ఆప్షన్ సభ్యులు**

రైతులకు మేలు చేసేందుకే...



జిల్లా కలెక్టర్లు వెంకటరమణ రెడ్డి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి- పిచ్చాటూరు : రైతులకు మేలు చేసేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పిచ్చాటూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధ్యక్షతన శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డిని ఎంపిపి హెచ్ రేఖా హరిచంద్ర రెడ్డి, జెడ్పిటిసి విష్ణుప్రియ, వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కె.వి.భాస్కర్ నాయుడు, పిచ్చాటూరు సర్పంచ్ కె.జి రోస్ రెడ్డి పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ పథకానికి సంబంధించి పైలట్ గ్రామాలుగా పిచ్చాటూరు మండలంలోని అప్పంబట్టు రాజానగరం గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ క్రమంలో సోమవారం ముందుగా అప్పంబట్టు రాజానగరం గ్రామంలో రైతులకు భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎక్కువ శాతం మంది భూమి వివాదాల్లో కూరుకుంటున్నారని, సర్వే నంబర్లు తేలక, సరిహద్దులు నిర్ధారణ కాక తద్వారా సంపూర్ణ హక్కులు పొందలేక చివరకు ఆ వివాదాలను వారసులకు సైతం అప్పగించాల్సిన పరిస్థితుల్లో రైతులు ఉన్నారని ఆయన వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోనేటి ఆది మూలం మాట్లాడుతూ సర్వే ప్రక్రియ పూర్తి అయిన తర్వాత జగనన్న భూహక్కుపత్రం నూటికి నూరు శాతం మీ భూమి హక్కును తెలియజేసే విధంగా, దానిని మరెవ్వరు కూడా తారుమారు చేయడానికి వీలు లేని విధంగా రూపొందిస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాలలో వైకాపా మండల కన్వీనర్ సింగిల్ విండో చైర్మన్ కె.టి హరిచంద్ర రెడ్డి నారాయణవనం జడ్పిటిసి సుమన్ కుమార్ తాడిపత్రి పరిశీలికుడు బిరేంద్ర వర్మ సింగిల్ విండో ఛైర్మన్ అపరంజీ రాజు కె.వి.బి పురం మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య ఎంపిటిసి రమేష్ రాజు చలపతి రాజ్ గోవిందన్ మోహన్ తోప్పయ్య పాలపద్మనాభం తదితర ప్రజా ప్రతినిధులు, నాయకులు, వీఆర్వోలు, సర్వే సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలను ఆదుకుంటున్నఅరణియార్ ప్రాజెక్ట్

అరణియార్ ప్రాజెక్టులో 10లక్షల రకాల చేప పిల్లలను జిల్లా కలెక్టర్లు వెంకటరమణ రెడ్డి, ఎమ్మెల్యే కోనేటి ఆధిమూలం, అర్ డి ఓ రామారావు వదిలారు. ఎమ్మెల్యే ఆదిమూల మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా 30 లక్షల చేప పిల్లలను ప్రాజెక్టులో వదిలి మత్స్య కార్మిక కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు ఎంతో ఉపయోగపడిందన్నారు. కలెక్టర్ వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో నీటి సామర్థ్యం 2 టీఎంసీలు ఉందని, ఈ ప్రాజెక్టు ఉండడం వలన పిచ్చాటూరు నాగలాపురం మండలం రైతులకు ఎంతో మేలు చేస్తూ రైతన్న కుటుంబాలను ఆదరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ మదన్ గోపాల్ రాజు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీపీ రేఖ హరిచంద్ర రెడ్డి జెడ్పిటిసి విష్ణు ప్రియ మండల అధ్యక్షుడు హరిచంద్ర రెడ్డి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు ఎంపీటీసీలు సర్పంచ్లు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

బీసీల దెబ్బ రుచి చూపిస్తాం: టీడీపీ



శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: బీసీలను అడుగడుగునా అణచివేస్తున్న జగన్ సర్కార్‌కు బీసీల దెబ్బేంటో రుచి చూపిస్తామని టిడిపి బీసీ విభాగం తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం హెచ్చరించారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలో సోమవారం బీసీ సాధికారిక కమిటీ ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ' కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివం మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 56 శాతంకు పైగా ఉన్న బీసీలకు వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా, వాటికి కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఎద్దేవా చేశారు. కార్పొరేషన్, సబ్ ప్లాన్ నిధుల్ని మళ్లించి బీసీలకు అన్యాయం చేశారన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో బీసీలు తీవ్ర అన్యాయం చేస్తున్న జగన్ సర్కార్ ను ప్రతి బీసీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. కూలదోసి ఎందుకు వారు ఆవేదన వ్యక్తం చేశారు.విజయ్ కుమార్ నాయుడు, చక్రాల ఉష, కంఠా రమేష్, కన్నావరం హరిబాబు, మిన్నల రవి, పోలూరు శ్రీనివాసరెడ్డి, గుమ్మడిపూడి దశరథ ఆచారి, రెడ్డివారి గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ వెంటే బీసీలు: వడ్లతాంగళ్

బీసీల సాధికారత వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమనీ, రాష్ట్రంలోని బీసీలంతా సీఎం జగన్ వెంటే ఉన్నారని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్లతాంగళ్ బాలాజీ ప్రసాద్ రెడ్డి అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో విజయవాడ వేదికగా ఈ నెల 7వ తేదీన తలపెట్టనున్న జయహో బీసీ సభను జయప్రదం చేయాలని సోమవారం ప్రకటనలో వడ్లతాంగళ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ సభనిద్దేశించి జగన్ ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని గుర్తు చేశారు. బీసీలకు చట్టసభల్లోనే కాకుండా, నామినేటెడ్ పదవులు ఇచ్చి ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు.

బీసీలకు రాజ్యాంగ రక్షణ లేదా..?: ఉమేష్ రావు


రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం గద్దెనెక్కాక బీసీలకు రాజ్యాంగ రక్షణ కరువైందని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అగ్రవర్ణ దురహంకారాన్ని నరనరాన జీర్ణించుకున్న వైసీపీ నాయకులు తమ ఆటవిక చర్యలతో ప్రతిపక్ష పార్టీలకు చెందిన బిసి నాయకత్వాలను అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నారని ఉమేష్ దుయ్యబట్టారు. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, సామాజిక కార్యకర్త అయిన రామచంద్ర యాదవ్ ను అంతమొందించాలన్న ఉద్దేశంతో వైసీపీ అల్లరి మూకలు దౌర్జన్యానికి దిగడాన్ని అడ్డుకోవాల్సిన పోలీసు వ్యవస్థ నిస్తేజంగా ఉండటం అత్యంత దౌర్భాగ్యం అని ఉమేష్ వాపోయారు.

పుత్తూరు టౌన్: రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు డిఎస్ గణేష్. చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, టీడీపీ బీసీ నాయకులు, పుత్తూరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ రవికుమార్‌ను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. పుత్తూరు మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎం.ఎస్.కరుణాకరన్, బి.ఆర్.యుగంధర్, పుత్తూరు పట్టణ టీడీపీ ప్రధానకార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్, తెలుగు యువత అధ్యక్షుడు బి.ఎస్.హరి, బీసీ నాయకులు కె.వెంకటేష్, పి.మణి రెడ్డి, పి.మోహన్, ప్రసాద్, మహేష్, రాజేంద్ర, సోము, శ్రీనివాసులు, ఇళయరాజా, భరత్ యాదవ్ తదితరులుపాల్గొన్నారు

పాకాల: మండలంలోని పెద్దరామాపురం చిగరపల్లి, గడ్డలచేను, యనమలవారిపల్లిలో టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి పులివర్తి నాని ఇదేం ఖర్మరా బాబు కార్యక్రమాన్ని మండల టిడిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. మండలంలో గుంతలమయమైన గ్రామీణ ప్రాంత రోడ్లు, పట్టించుకోని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి : దుర్మార్గపు పాలనతో పల్లెల్లో ప్రజలు అవస్థలు పడుతున్నారని డిటిపి మండల పార్టీ అధ్యక్షుడు దాసరి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద "ఇదేమి కర్మ రాష్ట్రానికి" అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టంలో దుర్మార్గపు పాలన జరుగుతుందన్నారు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాయి. మస్తా న్ నాయుడు, నాయకులు రాయి. సత్యం నాయుడు, సి. వి. కే ఎన్.ప్రసాద్ నాయుడు, జడపల్లి కోటేశ్వరరావు, చుట్టి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.
పోటో: -మాట్లాడుతున్న నాయకులు

గూడూరు : ఇదేం ఖర్మ మన బీసీలకు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాశం సునీల్ కుమార్ సూచనల మేరకు గూడూరు మండల తహాశీల్దార్‌కి వినతి పత్రం అందించారు.



గూడూరులో..

దళితులను మోసం చేస్తున్న బీజేపీ, వైసీపీ



ప్రజాశక్తి -రేణిగుంట : ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులను బిజెపి, వైసీపీ ప్రభుత్వాలు మోసం చేస్తున్నారని మాజీ ఎంపీ డాక్టర్ చింత మోహన్ అన్నారు. సోమవారంపట్టణంలోని జ్యోతి నగర్‌లో భారత్ జోడోయాత్ర ఇంటింటికి కాంగ్రెస్ యాత్రలో భాగంగా రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు విఆర్ రావణన్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

అన్నదానానికి రూ.5లక్షలు విరాళం


ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వ రాలయ నిత్యాన్నదాన పథకానికి శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన గుంటమిట్ట శ్రీనివాస మూర్తి కుటుంబ సభ్యులు సోమవారం రూ.5లక్షలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కురూపంలో ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేసి అన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా సూచించారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.



విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రేణిగుంట : మండలంలోని వెంకటాపురం పంచాయతీలో సోమవారం విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీనివాసరావు (65) శ్రీకాకుళం నుండి ఇక్కడకు వచ్చి కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, కొడుకు, కోడలు ఉన్నారు. అల్లిమెట్టల్లో కాపురం ఉంటున్నారు. రోజు లాగే కూలి పనికి వెళ్లి నాడు - నేడు స్కూల్ భవనంలో పనులు చేపడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని తెలిపారు.

తప్పిపోయిన పిల్లలను గంటలో పట్టుకున్న ఎస్ఐ



ప్రజాశక్తి - పాకాల: మండలంలోని దామలచెరువు పంచాయతీ కేశవ హరిజనవాడకు చెందిన రాము, సునీత దంపతుల పిల్లలు తప్పిపోయిన సంఘటన సోమవారం పన్నెండు గంటల ప్రాంతంలో దామలచెరువులో చోటు చేసుకుంది. పాకాల సి.ఐ రాజశేఖర్‌కు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో సమాచారాన్ని పాకాల ఎస్ఐ రామకృష్ణకి తెలిపారు. పాకాల ఎస్.ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ దామోదర్, సిబ్బందితో కలిసి అన్వేషించారు. నేంద్రకుంట వద్ద విచారిస్తుండగా ఒక అతను ఇద్దరు పిల్లలు తిరుపతి మార్గం వైపు అరగంట ముందు వెళ్ళారని తెలపడంతో తాము అటువైపు మార్గంలో వెళుతుండగా పనపాకం సమీపంలో పిల్లల్ని గుర్తించి వారిని స్టేషన్‌కి తీసుకురావడం జరిగిందని తెలిపారు. తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు స్టేషన్‌కు వచ్చిన తర్వాత పిల్లలు సంతోష్(11), హర్ష(9)లను వారి సమక్షంలో అప్పగించడం జరిగిందని తెలిపారు. సంతోష ఆరవ తరగతి, హర్ష నాలుగో తరగతి చదువుతున్నారని తెలిపారు. పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. పాకాల ఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ దామోదరంలను పాకాల సిఐ రాజశేఖర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు రాజేశ్వరి, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిలక్ష్మి, వెంకమరాజులకు పురస్కారాలు



ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా సోమవారం తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో సేవా ఉత్సవం-2022 జరిగింది. ఉత్తమ స్వచ్ఛంద సేవలందించిన వడమాలపేట మండలం ఎస్వీపురం గ్రామానికి చెందిన నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మికి, వ్యవస్థాపకలు అధ్యక్షులు వెంకమ రాజుకు సేవ రత్నం పురస్కారాలను శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభం చేతుల మీదుగా అందుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంఘిక సేవ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, వికలాంగుల సంక్షేమం, వృద్ధుల సంక్షేమం, రంగంలో సేవలు అందించినందుకు సేవారత్నం పురస్కారాలను అందించారు.

వైభవంగా మకర జ్యోతి స్వరూపుని 41వ జ్యోతి మహోత్సవం



ప్రజాశక్తి- నాయుడుపేట: మకరజ్యోతి స్వరూపుడు శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామి 41వ జ్యోతి మహోత్సవ కార్య క్రమం నాయుడు పేటలో సోమవారం సాయంత్రం అయ్యప్పస్వామి సేవ సమితి ఆధ్వర్యంలో మహా వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా జరిగే ఈ జ్యోతి మహోత్సవ కార్యక్రమానికి చుట్టుపక్కల మండలాలు, జిల్లాల నుంచే కాక పక్క రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేల సంఖ్యలో రావడం విశేషం. నాయుడుపేట గాంధీ మందిరం సెంటర్లో ఏర్పాటు చేసిన అయ్యప్ప పూజ కార్యక్రమానికి వచ్చినవారిని స్వామి వారి అలంకరణ ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా వందలసంఖ్యలో భక్తులు చేతుల్లో దీపాలతో పట్టణమంత తిరుగాడుతూ నిర్వహించిన గ్రామ దిపోత్సవం, రకరకాల వేష దారణలతో కేరళ, తమిళనాడు వారిచే చేయించిన నృత్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కర్పూరంతో పద్దెనిమిది పడి మెట్లపై వెలిగించిన జ్యోతి ప్రజ్వలన మహోత్సవం చూసిన వారంతా శబరిమలైలో ఉన్న అనుభూతిని తెచ్చిందని కొనియాడారు.

సభ్యులకు సంఘం భరోసా కావాలి: గోపాల్ రెడ్డి



సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వృత్తిలో నిరంతర శ్రమతో సేవలందించి పదవీ విరమణతో శేషాజీవితాన్ని గడుపుతున్న విశ్రాంత ఉద్యోగులకు రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చక్కటి భరోసాతో చేయూతనివ్వాలని మాజీ సిఎండిలు పి.గోపాల్ రెడ్డి, హెచ్ హరినాథ రావులు పిలుపునిచ్చారు. సోమవారం ఓ ప్రైవేటు హోటల్లో రిటైర్డ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పదవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సంధర్భంగా 73 ఏళ్లు పైబడిన 50 మంది సభ్యులను సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో సిజిఎం హెచ్‌ఆర్డీ వరకుమార్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్సులు రామస్వామి, వీరభద్రరావు, జాయింట్ సెక్రటరీ రాధా జయశ్రీ, తిరుపతిశాఖ అధ్యక్షులు కెఎస్ఎన్ చారి, కార్యదర్శి ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, కోశాధికారి కె. రాఘవేంద్రరావు, లక్ష్మి నారాయణ, వెంకటేశ్వర రెడ్డి, రాయలసీమ జిల్లాల ఆఫీస్ బేరర్లు, సభ్యులు హాజరయ్యారు.